
వైఎస్ తన దురాక్రమణకు పశ్చాత్తాపం చెందడం రామోజీరావును ఇబ్బంది పెట్టడానికేనా అనే చర్చ మనకు అనవసరం. అందరూ దురాక్రమణదారులే. పత్రికను అడ్డం పెట్టుకుని రాజకీయాలు చేస్తున్నావని ఇతడు అతనినంటే, రాజకీయలు అడ్డంపెట్టుకుని కోట్లు గడిస్తున్నావని అతడు ఇతనినంటున్నాడు. మనకెందుకు? మనకు కావలసింది ఒక్కటే. పేదలకు అసైన్ చేసి అన్యాక్రాంతమైనాయని ముఖ్యమంత్రి స్వయంగా ఒప్పుకున్న 10 లక్షల ఎకరాలు తిరిగి లబ్దిదారులకే ఇవ్వాలి. దీనికి మూడు ఆటంకాలు కనిపిస్తున్నాయి. రెండు ముఖ్యమంత్రి చేసిన ప్రకటనలోనే ఉన్నాయి. మూడవది ఈ మధ్యనే రాష్ట్ర ప్రభుత్వం జారీచేసిన ఆర్డినెన్స్‌లో ఉంది.

# అన్యాక్రాంతమైన అసైన్డ్ భూములు తిరిగి లబ్దిదారుకే చెందాలి



పేదల భూమి పోరాటాల గురించి అప్పుడెప్పుడో వింటుండే వాళ్ళం. 'ఇంక భూములెక్కడున్నాయి పోరాటాలు చేయడానికి' అని పోరాటాలు చేసిన వాళ్ళే అనే దశ వచ్చింది. అంతలో ధనవంతుల భూమి పోరాటాలు అకస్మాత్తుగా ముందుకొచ్చాయి. భూమి చాలా ఉందని ఇప్పుడర్థం అవుతున్నది గానీ ఏం చేయగలమో మాత్రం తెలీదు. పేదలకు అసైన్ చేసి అన్యాక్రాంతమైన భూమే 10 లక్షల ఎకరాలు ఉందని ముఖ్యమంత్రి నిన్నగాక మొన్న స్వయంగా ప్రకటించాడు. ఖర్చుపెట్టి బాగుచేసి బావి తవ్వి లేక బోరువేసి ఇస్తే అది పది లక్షల పేదలకు తిండి పెట్టగలదు. పేదలకు భూములు కల్పించడం కోసమే ఇడుపలపాయ భూముల్ని ప్రభుత్వానికి స్వచ్ఛందంగా అప్పగించేశానని చెప్తున్న ముఖ్యమంత్రి ఆ పని చేస్తాడా?

వైఎస్ రాజశేఖరరెడ్డి గురించి అటువంటి దురభిప్రాయాలు ఎవరికీ ఉండనవసరం లేదు. అతనిది పేదలకోసం బాధపడి ఎరిగిన మనసు కాదు. ఇడుపలపాయ భూములు అక్రమంగా స్వంతం చేసుకున్నవని తనకిన్నాళ్ళూ తెలియనే తెలియదని అన్నాడు. కడప జిల్లాలో అతనికి తప్ప అందరికీ ఆ సంగతి ఎప్పటినుంచో తెలుసును. అయితే బలవంతుల అక్రమాల గురించి ఏమీ చేయలేకున్న సాధారణ నిస్సహాయతకు తోడు ఆ జిల్లాలో వైఎస్‌ను వ్యతిరేకించి బతకడం సాధ్యంకాదన్న భయం తోడై దాని గురించి మాట్లాడడం ప్రజలు మానేశారు. అంతమాత్రం చేత ఎవరికీ తెలీదనుకొని తన తెలివికి తానే మురిసిపోవడం ఏ నీతీ లేని మనిషికే చెల్లింది.

వైఎస్ తన దురాక్రమణకు పశ్చాత్తాపం చెందడం రామోజీరావును ఇబ్బంది పెట్టడానికేనా అనే చర్చ మనకు అనవసరం. అందరూ దురాక్రమణదారులే. పత్రికను అడ్డం పెట్టుకుని రాజకీయాలు చేస్తున్నావని ఇతడు అతనినంటే, రాజకీయలు అడ్డంపెట్టుకుని కోట్లు గడిస్తున్నావని అతడు ఇతనినంటున్నాడు. మనకెందుకు?

మనకు కావలసింది ఒక్కటే. పేదలకు అసైన్ చేసి అన్యాక్రాంతమైనాయని ముఖ్యమంత్రి స్వయంగా ఒప్పుకున్న 10 లక్షల ఎకరాలు తిరిగి లబ్దిదారులకే ఇవ్వాలి. దీనికి మూడు ఆటంకాలు కనిపిస్తున్నాయి. రెండు ముఖ్యమంత్రి చేసిన ప్రకటనలోనే ఉన్నాయి. మూడవది ఈ మధ్యనే రాష్ట్ర ప్రభుత్వం జారీచేసిన ఆర్డినెన్స్‌లో ఉంది.

అన్యాక్రాంతమైన భూమి సాగుయోగ్యమైనది కాకపోతే దానిని తొలినాటి లబ్దిదారుకు తిరిగి ఇవ్వకుండా ఏదైనా 'ప్రజావసరాల' కోసం వాడుకుంటామని ముఖ్యమంత్రి అన్నాడు. (అంటే భూమిలేని పేదలకు భూమి ఇవ్వడం ప్రజావసరం కాదనా?) దీనిని తెలివితక్కువతనం అనాలో అతితెలివి అనాలో తెలీదు. సాగుయోగ్యం కాని భూములను కాక సాగుయోగ్యమైన వాటి నెప్పుడైనా పేదలకు అసైన్ చేశారా? పేదలకు అసైన్ చేసేదే బంజర్లను. అవి ఎప్పుడో తప్ప ఉన్న పళంగా సాగుయోగ్యంగా ఉండవు. ప్రభుత్వం ఆ భూమికి పేదలకు 'డి' ఫారం పట్టాలు ఇచ్చేసి చేతులు దులిపేసుకుంటుంది తప్ప ఆ భూమిని సాగుయోగ్యం చేసుకోవడానికి ఏ సహాయం చేయదు. పైగా, పట్టా ఇచ్చాక ఫలానా గడువు లోపల సాగులోకి తేకపోతే అసైన్‌మెంట్ రద్దవుతుందని ఒక షరతు కూడా 'డి' ఫారం పట్టాలోనే ఉంటుంది. లబ్దిదారులు గత్యంతరం లేక ఆ భూమిని పెట్టుబడిపెట్టి బాగుచేయగల వాళ్ళకు అమ్ముకోవడమో, 'కౌలుకు' ఇవ్వడమో తరచుగా జరుగుతుంది. అసైన్డ్ భూముల అన్యాక్రాంతానికి ఇదొక ముఖ్యకారణం. ఇదేమీ ఎరుగనట్టు అన్యాక్రాంతమైన భూమి సాగుయోగ్యం కానట్టయితే

ప్రభుత్వమే దానిని తీసేసుకుంటుందనడాన్ని ఏ రకంగా అర్థం చేసుకోవాలి?

ఈ మధ్య రాష్ట్ర ప్రభుత్వం జారీచేసిన ఆర్డినెన్స్‌తో దీనిని జతచేసి చూసుకున్నప్పుడే దీని భావం పూర్తిగా అర్థం అవుతుంది. 1977లో చేసిన అసైన్డ్ భూముల (బదలాయింపు నిషేధ) చట్టం కింద, పేదలకు అసైన్ చేసిన భూమిని వారు వేరే ఎవరికైనా అమ్మినా, ఇతర కారణాలుగా అది అన్యాక్రాంతమైనా దానిని తిరిగి లబ్దిదారుకే ఇవ్వాలి. అది ఆచరణ సాధ్యం కానప్పుడు మాత్రమే ప్రభుత్వం దానిని తీసేసుకోవచ్చు. అసైన్‌మెంట్ పొందిన పేదలు గత్యంతరం లేని పరిస్థితిలోనే దానిని అన్యాక్రాంతం కానిస్తారన్న సామాజిక అవగాహనతో ఆ చట్టం రూపొందింది. ప్రస్తుత ఆర్డినెన్స్ ఆ దౌర్బల్యానికి వారిని శిక్షించదలచుకుంది. ఒకసారి అన్యాక్రాంతం కానిస్తే ఆ భూమిపైన లబ్దిదారుకు హక్కు పోతుంది. అది ప్రభుత్వానికే చెందుతుంది. ప్రభుత్వం బుద్ధిపుడితే వారికే తిరిగి అసైన్ చేయవచ్చు, కాని చేయాలన్న నియమం లేదు.

**ఒక పక్క పేదల భూములు పేదలకే తిరిగి ఇప్పిస్తున్నట్టు కనిపించడం, మరొక పక్క రామోజీరావు, చంద్రబాబు నాయుడు తదితర అసంఖ్యాక ప్రత్యర్థి భూకబ్జాదారులపైన కక్ష తీర్చుకోవడం, పనిలో పనిగా పెట్టుబడిదారీ కంపెనీలకు ధారాదత్తం చేయడానికి ప్రభుత్వం చేతిలోకి మరింత భూమిని తెచ్చుకోవడం - ఇదీ వైఎస్ త్రికోణ భూమి విధానం.**

దీనినీ, పైవిషయాన్నీ కలిపి చదివితే, అప్పుడెప్పుడో బుద్ధిలేక పేదలకు ఇచ్చేసిన భూమిని వీలైన మేరకు తిరిగి ప్రభుత్వం చేతిలోకి తీసుకోవాలన్న ఆరాటమే కనిపిస్తుంది తప్ప పేదలకు న్యాయం చేయాలన్న ఆకాంక్ష కాదు. సాగుయోగ్యం కాని బంజర్లు ప్రభుత్వానికి ఎందుకు? ప్రత్యేక ఆర్థిక మండలులకు, పెట్టుబడిదారీ కంపెనీలకు అప్పగించడానికి. ఇంకెందుకు?

ముఖ్యమంత్రి ఇంకొక షరతు కూడా పెట్టాడు. అన్యాక్రాంతమైన భూమిని కొనుక్కున్నది కూడా చిన్న రైతులే అయితే దానిని వారికే క్రమబద్ధీకరిస్తామన్నాడు. ఇది దుర్మార్గమైన ఆలోచన. అసలు ప్రభుత్వం ఉచితంగా ఇచ్చిన ఒకటి రెండెకరాలను పేదలు ఎందుకు అన్యాక్రాంతం కానిస్తారన్న కనీస అవగాహన అతనికి ఉందా? ఒళ్ళు బలిసి అమ్ముకుంటున్నా రనుకుంటున్నాడా? వాళ్ళకు బండలు, తుప్పలు, పుట్టలు నిండిన భూమి, ఊరి వ్యవసాయ భూములకు దూరంగా ఎక్కడో గుట్టలలో ఉన్న భూమి ఇస్తారు. ఏ పూటకాపూట పని చేసుకుంటే తప్ప గడవని వారికి దానిని సకాలంలో సాగులోకి తేవడం కష్టం. ఆ భూములు ఇతరుల చేతిలోకి పోవడానికి ఇదొక ముఖ్యకారణం.

దౌర్జన్యమూ తరచుగా జరుగుతుంటుంది. అనేక సందర్భాలలో అసైన్డ్ భూములకు 'డి' ఫారం పట్టా లబ్ధిదారు చేతిలో పెడతారుగానీ భూమి ఎక్కడుందో చూపించరు. లబ్దిదారు వెతుక్కుంటూ పోతే అక్కడెవరో ఆక్రమించుకొని ఉంటారు. ఇది నీది కాదు పొమ్మంటారు. అసైన్ చేసిన భూమి ఒక భూస్వామి సీలింగ్ భూమి అయినట్టయితే, తరచుగా ఆ భూస్వామి ఆ సీలింగ్ భూమిని కాగితం మీద తప్ప నిజంగా ప్రభుత్వానికి అప్పగించి ఉండడు. అతను తనకు అనుకూలురైన చిన్న రైతులకే దానిని అప్పగించవచ్చు. అప్పుడు అన్యాక్రాంతమైనది చిన్న రైతుకే కాబట్టి అతనికే అప్పగిస్తామనడం ఏం న్యాయం? అయినా చిన్న రైతయితే ఫరవాలేదంటే దురాక్రమణ దారులంతా చిన్న రైతులుగా అవతారమెత్తగలరు. కుటుంబ ఆస్తులను పది ముక్కలుగా పంచుకుని మరీ అవతారమెత్తగలరు.

వనరులు లేని పేదలకు వనరుల పైన హక్కు కల్పించాలన్న న్యాయబద్ధమైన ఆలోచన పట్ల వెటకారం ఈ విధాన ప్రకటనలలోని ప్రధాన విషయం. ఒక పక్క పేదల భూములు పేదలకే తిరిగి ఇప్పిస్తున్నట్టు కనిపించడం, మరొక పక్క రామోజీరావు, చంద్రబాబు నాయుడు తదితర అసంఖ్యాక ప్రత్యర్థి భూకబ్జాదారులపైన కక్ష తీర్చుకోవడం, పనిలో పనిగా పెట్టుబడి దారీ కంపెనీలకు ధారాదత్తం చేయడానికి ప్రభుత్వం చేతిలోకి మరింత భూమిని తెచ్చుకోవడం - ఇదీ వైఎస్ త్రికోణ భూమి విధానం.

1977 నుంచి అమలులో ఉన్న అసైన్డ్ భూముల (బదలాయింపు నిషేధ) చట్టాన్ని (దీనిని క్లుప్తంగా 9/77 చట్టం అని పిలుస్తారు) ఉన్నదున్నట్టు అమలుచేయాలనీ అన్యాక్రాంతమైన భూములను తొలినాటి లబ్దిదారుకే తిరిగి అప్పగించాలనీ ప్రజాతంత్ర శక్తులంతా ఉద్యమించాల్సిన అవసరం ఉంది. అయితే మళ్ళీ బంజరు భూమినే చేతిలో పెట్టకుండా, దానిని సాగుయోగ్యం చేసి ఇవ్వాలి. ప్రస్తుతం రాష్ట్రంలో సగభాగంలో అమలులో ఉన్న గ్రామీణ ఉపాధి హామీ పథకం దీనికి ఉపయోగపడుతుంది. ఆ పథకం కింద చేపట్టగల పనులలో ఒకటి, గ్రామంలో భూమి లేని పేదలకిచ్చిన అసైన్డ్ భూములను సాగుయోగ్యం చేయడం. దీనిని ఉపయోగించుకుంటే తిరిగి ఇచ్చిన 'డి' ఫారం భూములు మళ్ళీ అన్యాక్రాంతం కాకుండా చూడవచ్చు.

మానవహక్కుల వేదిక

**Human Rights Forum (HRF)**

**1 జనవరి, 2007**